సెయింట్ పీటర్స్‌లో 'స్టూడెంట్ చాప్టర్'

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా స్టూడెంట్ చాప్టర్ ప్రారంభించారు. సీఎస్ఐ ప్రతినిధులు నాగేంద్ర, సూర్యదేవ, కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి, ప్రిన్సిపాల్ రామస్వామిరెడ్డి కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. 483 మంది విద్యార్థులు సీఎస్ఐ సభ్యులుగా నమోదు చేసుకున్నట్లు తెలిపారు. డైరెక్టర్లు సరోజారెడ్డి, అనురాగ్‌రెడ్డి, పీఆర్వో రవిసుధాకర్, హెచ్‌ఓడీ శాంతి, అర్చన్ కులకర్ణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ


లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న ఎంపీ ఈటల

కీసర: నాగారం మున్సిపాలిటీకి చెందిన అనిల్ కుమార్‌కు రూ.46,500, ఎం.జాన్ కెనెడీకి రూ.60 వేల సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి మంజూరైన చెక్కులను సోమవారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ చేతులమీదుగా అందజేశారు. నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'గోల్డెన్ అవర్'లో మెరుగైన చికిత్స

– వ్యక్తి ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది

కీసర: గోల్డెన్ అవర్‌లో కీసర 108 సిబ్బంది అంబులెన్స్‌లో అత్యవసర మెరుగైన చికిత్స అందించి ఓ వ్యక్తి ప్రాణాలు కాపాడారు. వివరాల ప్రకారం.. కీసర రాజీవ్ గృహకల్ప కాలనీలో ఆర్‌జీకే కాలనీలో ఓ వ్యక్తి నాల్గో అంతస్తు పైనుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది ఈఎంటీ చిత్రం రవి, పైలెట్ ప్రభాకర్‌లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని 108లో చేర్పించి అత్యవసర వైద్యసేవలు అందించి మెరుగైన చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. దీంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ప్రస్తుతం గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు వైద్యులు తెలిపారు. వ్యక్తి ప్రాణాలు నిలబెట్టిన 108 సిబ్బందిని ఆస్పత్రి వైద్యులు అభినందించారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు



మేడ్చల్‌రూరల్: మున్సిపాలిటీ పరిధి పూడూర్ గ్రామంలోని ఎర్రచెరువు అలుగులుపోయడంతో సోమవారం గ్రామస్తులు చెరువు వద్ద గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు.ప్రతిఏటాచెరువు అలుగులు పోస్తుండటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. నాయకులు పోచయ్య, వెంకటేష్, రఘు, నర్సింహ్మ, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణ, హన్మంత్‌రెడ్డి, లక్ష్మణ్, చంద్రశేఖర్,నరేందర్, చారి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

జవహర్‌నగర్: కార్పొరేషన్ 28వ డివిజన్ మదర్ థెరిస్సా కాలనీలో కేర్ హౌస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లైఫ్‌లైన్ మెడిక్యూర్, స్మార్ట్ విజన్ కంటి ఆసుపత్రి సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్ హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బీపీ, షుగర్, జనరల్ హెల్త్ చెకప్, కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కేర్ హౌస్ ఫౌండేషన్ కో–ఫౌండర్ రేంజుమోన్, సభ్యులు సారా, స్మార్ట్ విజన్ కంటి ఆసుపత్రి సీనియర్ మేనేజర్ మహేందర్, అనిత, శ్రీదేవి, గణేష్, అంజి, కాలనీ అధ్యక్షులు బూడిద వెంకటేష్, మంజుల, రవి, కిషోర్, రమేష్‌చారి, భాస్కర్‌గౌడ్, శారద, బాలమురళి, సుధా తదితరులు పాల్గొన్నారు.


ఓ భవనం సెల్లార్‌లోకి చేరిన వరద


సిద్ధార్థ కళాశాల ఎదుట...

ఎన్నాళ్లీ దుస్థితి..?

- కానరాని పురోగతి. పోచారంలో రోడ్లపై నిలిచిన వరద నీరు
- గుంతలమయమైన రోడ్లు, ఇబ్బంది పడుతున్న వాహనదారులు

పోచారం: గత రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు పోచారం మున్సిపాలిటీ పరిధిలోని పలు చోట్ల వరద నీరు నిలిచిపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మున్సిపాలిలోని పలు ప్రాంతాల్లో మట్టి రోడ్లే ఎక్కువగా ఉన్నాయి. కాలనీలు విస్తరిస్తున్నప్పటికీ తగిన స్థాయిలో రోడ్ల నిర్మాణాలు జరగడం లేదు. దీంతో మట్టి రోడ్లను వినియోగించేవారిలో వర్షం పడితే వణుకు మొదలవుతోంది.

జోడిమెట్ల చౌరస్తా వద్ద నిలిచిన వరద...

గతంలో జోడిమెట్ల చౌరస్తా వద్ద జాతీయ రహదారిపై వరద నీరు నిలిచేది. ఈ సమస్య రోడ్డు విస్తరణ పనులు జరిగిన తర్వాత సమిసిపోయింది. ఇదిలా ఉండగా.. జోడిమెట్ల చౌరస్తా నుంచి పోచారం వెళ్లే రహదారిపై వరద నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఆ దారిలో వెళ్లాలంటే భయపడుతున్నారు. ప్రస్తుతం కొందరు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరద నీరు సాఫీగా వెళ్లకపోవడంతో రోడ్డుపైనే నిలవడంతో రహదారి తటాకాన్ని తలిపిస్తోంది. చౌరస్తా పక్కనే ఉన్న భవనం సెల్లార్లలోకి కూడా వరద వచ్చి చేరింది. దీంతో సెల్లార్‌లో ఏర్పాటు చేసిన షాపుల నిర్వాహకులు ఇబ్బంది పడుతున్నారు.

సిద్ధార్థ కళాశాల ఎదుట ఇదే పరిస్థితి..

కొర్రెముల్‌లోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ఎదుట వరద నీరు రోడ్డుపైనే నిలవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుప్రభాత్ టౌన్‌షిప్, ఏకశిలానగర్, కాచవానిసింగారం వెళ్లాలంటే ఈ రోడ్డే గతి. ఈ ప్రాంతాల ప్రజలు అటువైపు వెళ్లాలంటే నరకయాతన అనుభవించక తప్పదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

జాతీయ రహదారిపైనా...

నారపల్లిలోని ఎంజేఆర్‌మాల్ సమీపంలో జాతీయ రహదారిపైనా వరదనీరు నిలిచింది. అనేకసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఎలాంటి పురోగతి కనిపించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వారు స్పందించి సమస్య పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రుణమాఫీ హామీని నిలబెట్టుకోవాలి

మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఘట్‌కేసర్: రైతులకు ఇచ్చిన రుణమాఫీ హామీని నిలబెట్టుకోవాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు రుణమాఫీ సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షకు సోమవారం ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని, గతంలో ఎప్పుడూ చూడలేదన్నారు. వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, మల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి రిలే నిరహార దీక్ష చేపట్టగా.. రుణమాఫీ సాధన సమితి అధ్యక్షుడు గౌరీశంకర్, మాజీ మేయర్ వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ కొండల్ రెడ్డి, మహిపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి రైతులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం


ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ


కీసరలో..

మేడ్చల్‌రూరల్: ఉమ్మడి మేడ్చల్ మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం మేడ్చల్ ఎంఈఓ శంకరయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్ఎస్ఆర్ జూనియర్ కళాశాల చైర్మన్ శశిధర్‌రెడ్డి సన్మాతదాతగా వ్యవహరించి మండలస్థాయిలో వివిధ పాఠశాలల నుంచి ఎంపికైన 14 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించి మెమెంటోలు ప్రదానం చేశారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు మధుసూదన్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, రజిత, నాగేశ్వర్, రమణ, నవీన్, జనార్దన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కీసర: కీసర మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కార గ్రహీతలకు మండల విద్యాధికారి జమదగ్ని ఆధ్వర్యంలో సోమవారం కీసరలోని నవోదయ విద్యాలయలో సత్కార కార్యక్రమం నిర్వహించారు. నాగారం మున్సిపాలిటీ కమిషనర్ భాస్కర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉత్తమమైందని, విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైందన్నారు. అనంతరం మండల స్థాయి ఉపాధ్యాయులు సుప్రజ, విద్యాసాగర్, జగన్ మోహన్, జ్యోష్నలను సత్కరించారు.

దివ్యాంగులకు చేయూతనివ్వాలి

వీహెచ్‌పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు ఉపేందర్‌గౌడ్


ఘట్‌కేసర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట దివ్యాంగుల నిరసన

ఘట్‌కేసర్: కాంగ్రెస్ ప్రభుత్వం వికలాంగుల చేయూత పెన్షన్ లబ్ధిదారులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్‌మాదిగ, వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) నియోజకవర్గ అధ్యక్షుడు ఉపేందర్‌గౌడ్ అన్నారు. వికలాంగుల పెన్షన్ పెంచాలని కోరుతూ.. వీఎచ్‌పీఎస్, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వికలాంగులకు రూ. 6 వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ. 4 వేలు, కండరాల బలహీతన కలవారికి రూ. 15 వేల వరకు పెన్షన్ పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పెన్షన్లు పెంచడంలో నిర్లక్ష్యం చేస్తే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. శివమాదిగ, బాలనర్సింహ్మా, అంజి, ఉపేందర్, గణేశ్, వంశీ, సాయిలు, వీహెచ్‌పీఎస్, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

పేదలకు సేవ చేసే అధికారులు దొరకడం అదృష్టం

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్


దేవరయాంజాల్ సేవాలాల్ తాండా సందర్శనలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్‌నాయక్, కలెక్టర్ మనూ చౌదరి

శామీర్‌పేట్: పేదల సమస్యలను తీర్చే అధికారులు దొరకడం అదృష్టమని, అందుకు మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనూ చౌదరి నిదర్శనమని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్ అన్నారు. సోమవారం తూంకుంట మున్సిపాలిటీ, దేవరయాంజాల్‌లోని సేవాలాల్ తాండాను మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనూచౌదరితో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హుస్సేన్‌నాయక్ మాట్లాడుతూ... దేవాదాయ భూముల్లో ఎన్నో ఏళ్లుగా గుడిసెలు వేసుకుని ఇక్కడే నివసిస్తున్న పేదలకు పట్టాలు జారీ చేసేందుకు సహకరించాలని కలెక్టర్‌ను ఆయన కోరారు. విద్యుత్, తాగునీటితో పాటు మౌలిక వసతులను కల్పించేందుకు కృషి చేయాలని కోరారు. కనీస అవసరాలు తీరిస్తే పేద ప్రజలతో పాటు పిల్లల భవిష్యత్తు బాగుంటుందని వారు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.

మానవతా దృక్పథంతో సమస్యలు పరిష్కారిస్తా : కలెక్టర్

ఇక్కడికి వచ్చాక సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించానని.. మానవతా దృక్పథంతో మీ సమస్యలను పరిష్కరిస్తానని కలెక్టర్ మనూచౌదరి అన్నారు. తండావాసులకు సింగిల్ ఫేస్ విద్యుత్ అందించేందుకు విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశిస్తానని హామీ ఇచ్చారు. మౌలిక వసతులైన తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ, వీధిదీపాలు తదితర సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత శాఖలతో చర్చించి, పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు.

పట్టాల పంపిణీపై..

పట్టాల పంపిణీ విషయమై దేవాదాయశాఖ ఉన్నతాధికారులతో చర్చించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తానని తెలిపారు. దేవాదాయ కమిషనర్ అనిత, కీసర ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి, శామీర్‌పేట తహసీల్దార్ యాదగిరిరెడ్డి, జిల్లా మైనార్టీ అధికారి పద్మజ, తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి, విద్యుత్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేబిస్ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ ఆసుపత్రి వైద్యులు, విద్యార్థులు మునీరాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రేబిస్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెబిస్ వ్యాధిపై కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు వివరించారు. సీఎంఆర్ ఆసుపత్రి సీఓడీ రాజ్‌కుమార్, పీఆర్వో దుర్గాప్రసాద్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజావాణికి ఫిర్యాదులు

మేడ్చల్: గుండ్లపోచంపల్లి, ఎల్లంపేట్, మేడ్చల్ మున్సిపాలిటీల్లో అక్రమ వ్యాపారస్తులను నిర్మూలించాలని, అక్రమంగా చెట్లను నరికివేస్తూ.. వ్యాపారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మేడ్చల్‌కు చెందిన ఆర్టీఐ ప్రతినిధి రమేశ్‌గుప్తా ఫిర్యాదు చేశారు. మున్సిపాలిటీల్లో కొందరు వ్యాపారులు కల్తీ, డూప్లికేట్ వస్తువులను అమ్ముతూ.. సొమ్ము చేసుకుంటున్నారని, కొందరు అధికారుల అండదండలతో అక్రమంగా చెట్లు నరికి వ్యాపారం సాగిస్తున్నారని ఫిర్యాదు చేశారు.

'ఎమ్మార్‌సీఈ'లో ఇంజినీర్స్ డే



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్‌సీఈ, కండ్లకోయలోని సీఎంఆర్‌టీసీ కళాశాలలో సోమవారం ఇంజినీర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మార్‌సీఈ కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో ఉస్మానియా యూనివర్సిటీ సీఓఈ శశికాంత్, కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ పాల్గొని విద్యార్థులకు ఇంజినీర్స్ డే ఆవశ్యకతను వివరించారు. కళాశాల చైర్మన్ గోపాల్ రెడ్డి, డైరెక్టర్ రాజిరెడ్డి పాల్గొన్నారు.

17 నుంచి 'స్వస్థ నారీ– సశక్త్ పరివార్ అభియాన్'

జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

సాక్షి, మేడ్చల్ జిల్లా: కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో 17 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించ తలపెట్టిన ''స్వస్థ నారీ – సశక్త్ పరివార్ అభియాన్'' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా తెలిపారు. తెలంగాణ కమిషనర్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ ఆదేశాల మేరకు మేడ్చల్ జిల్లాలో 'స్వస్థ నారీ – సశక్త్ పరివార్ అభియాన్'' కార్యక్రమాన్ని అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ నెల 17న ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి కన్వెన్షన్ మీటింగ్‌లో ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన సెలవుదినాలను మినహాయించి 12 రోజుల పాటు జిల్లా ఆసుపత్రి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాల్లో ప్రత్యేక వైద్యనిపుణులచే మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు ప్రధాన లక్ష్యం ''మహిళల ఆరోగ్యం – శక్తివంతమైన కుటుంబాలు''గా తీర్చిదిద్దటమేనని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వ స్కూళ్లల్లో ఆరోగ్య పరీక్షలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అవసరమైన వారిని ప్రత్యేక ఆరోగ్య శిబిరాలకు తరలించే ఏర్పాట్లు చేస్తామన్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ సి.ఉమాగౌరీ, మహిళా, శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి శారద, ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. తెలంగాణ కమిషనర్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ రాష్ట్ర ఉన్నతాధికారులు ''స్వస్థ నారీ – సశక్త్ పరివార్ అభియాన్'' కార్యక్రమానికి సంబంధించిన విధి, విధానాలను వీడియో కాన్ఫరెన్స్‌లో పేర్కొన్నారు. చేపట్టాల్సిన ఆరోగ్య పరీక్షలు ,అవగాహన కార్యక్రమాలపై రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను వివరించారు.

హామీలు నెరవేర్చకపోతే ప్రజాభవన్ ముట్టడిస్తాం !

కలెక్టరేట్ ధర్నాలో సీపీఎం రాష్ట్ర నేత పాలడుగు భాస్కర్



సాక్షి,మేడ్చల్ జిల్లా: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకపోతే త్వరలో ప్రజాభవన్ ముట్టడిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ఒకటిన్నర సంవత్సరం పూర్తయినా ఇప్పటి వరకు పేదలకు కొత్త ఆసరా పెన్షన్లు ఇవ్వకపోగా.. వాగ్దానం ప్రకారం పెన్షన్స్ మొత్తాన్ని పెంచకపోవటంపై తీవ్రంగా ధ్వజమెత్తారు. సోమవారం మేడ్చల్ కలెక్టరేట్ వద్ద సీపీఎం పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం వద్ద డబ్బులు లేవన్న సాకుతో వాటిని అమలు చేయకుండా జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. అర్హులైన వారందరికీ కొత్త పెన్షన్లు ఇవ్వడంతో పాటు దివ్యాంగుల పెన్షన్ రూ. 6వేలు, ఇతరులకు రూ.4 వేలు పెంచాలని సీపీఎం పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కలెక్టరేట్ ఎదుట మహిళల ధర్నా, బైఠాయింపు అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సత్యం , సీపీఎం జిల్లా నాయకులు చంద్రశేఖర్, కోమటి రవి, అశోక్, వినోద, వెంకట్, శ్రీనివాస్,రాజశేఖర్.శ్రీనివాస్, రాథోడ్ సంతోష్, లింగస్వామి, నరేష్, లక్ష్మణ్, సబిత, శంకర్, మండల నాయకులు గణేష్, మంగ, స్వామి, రమేష్ పాల్గొన్నారు.

పెంచిన పెన్షన్లు ఇవ్వాలని ధర్నా

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా, అధికారులకు వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

కీసర: వికలాంగులు, ఇతర పెన్షన్‌దారుల పెన్షన్లను పెంచాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్), చేయూత పెన్షన్‌దారుల హక్కుల పోరాట సమితి (సీపీహెచ్‌పీఎస్), మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం కీసర మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడుస్తున్నా.. పెంచిన పెన్షన్లను ఇవ్వాలని, వికలాంగులకు రూ.6000 , వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, నేత, గీత, బీడీ కార్మికులు, ఇతర పెన్షన్‌దారులకు రూ.4000 పెంచాలని, కండరాల క్షీణత కలిగిన వారికి రూ.15 వేలు ఇవ్వాలన్నారు. ఆవుల అల్లాజీ, టైగర్ నర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి, రాజురెడ్డి, కృష్ణారెడ్డి, రమేష్, ముత్యం, బాలస్వామి, దత్తు, మోహన్‌రావు, భాగ్యమ్మ, భిక్షపతిగౌడ్, విక్టోరి, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంచాల మహేందర్, జగన్, శ్రీనివాస్, మల్లేష్, పరమేష్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

శిథిలాల తొలగింపు



ఘట్‌కేసర్: పట్టణంలో ప్రయాణికుల రాకపోకలకు అడ్డుగా నిర్మాణాలను కాంగ్రెస్ నాయకుడు ముల్లి జంజయ్యమాదవ్ సొంత డబ్బుతో తొలగించారు. వాహనాలు సాఫీగా వెళ్లేందుకు అడ్డుగా ఉన్న శిథిలాలను జేసీబీ, ట్రాక్టర్ సాయంతో తొలగింపజేశారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు ఆయనను అభినందించారు. బీ బ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ మల్లేష్, డీసీసీ కార్యదర్శి ఆంజనేయులుగౌడ్, ఉపాధ్యక్షు ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, మైనారిటీ అధ్యక్షుడు ఫరూక్, నరేష్‌గౌడ్, గణేష్, ఖయూమ్, నర్సింగ్‌రావు, సత్తిరెడ్డి, సల్మాన్ పాల్గొన్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి గల్లంతు

శామీర్‌పేట్: వరద నీటిలో చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ వ్యక్తి నీట మునిగి మృతిచెందిన ఘటన సోమవారం శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్‌కు వల్లపు హనుమయ్య (28), సోమవారం సాయంత్రం స్నేహితులతో కలిసి తూంకుంట మున్సిపాలిటీ కేంద్రంలోని నల్లకుంట చెరువు నుంచి పారుతున్న వరదలో చేపలు పట్టడానికి వచ్చారు. కాగా నీటి కాల్వలోకి దిగి చేపలు పడుతుండగా.. ప్రమాదవశాత్తు పక్కనే లోతుగా ఉన్న కాలువలో పడి నీటిలో గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న శామీర్‌పేట పోలీసులు, ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని తాళ్ళ సాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. కేసు దర్యాప్తులో ఉంది.


మృతదేహాన్ని వెలికి తీస్తున్న పోలీస్, ఫైర్ సిబ్బంది

పాతవి పెంచలే.. కొత్తవి ఇయ్యలే!

రూ.4 వేలు ఇస్తామని ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ
- రెండేళ్లు కావస్తున్నా.. ఆ ఊసే ఎత్తని ప్రభుత్వం
- అర్హులకు కొత్త పెన్షన్ల హామీ నెరవేరని పరిస్థితి
- మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో 3.51 లక్షల మంది

సాక్షి,మేడ్చల్ జిల్లా: అర్హులకు కొత్త పెన్షన్లు మంజూరు చేస్తామని.. ప్రస్తుతం పెన్షన్ పొందుతున్న వారికి రూ.2 వేల నుంచి రూ.4 వేల చొప్పున అందిస్తామని ఎన్నికల హామీలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పింది. కొత్త ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావస్తున్నా.. ఆ ఊసే ఎత్తడం లేదు.

ఏళ్లుగా ఎదురుచూపులు..

ప్రజాపాలన కార్యక్రమం ద్వారా దరఖాస్తు చేసుకుని, ఏళ్లుగా కలెక్టరేట్ ప్రజావాణి, పురపాలక సంఘాలు, ఎంపీడీవో కార్యాలయాల్లో వినతులు ఇస్తున్నా.. కొత్త పెన్షన్లు మంజూరు కాక వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు ఎదురుచూపులు తప్పడం లేదు. అప్పుడప్పుడు అధికారులు హడావుడి చేస్తున్నా.. పరిస్థితి మొదటికే వస్తోంది.

నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి,రంగారెడ్డి జిల్లాల్లో 42 మండలాలు, 34 పురపాలికల పరిధిలో కొత్త పెన్షన్ కోసం దరఖాస్తు చేసిన వారు వేలల్లో ఉన్నారు. వృద్ధాప్య పెన్షన్ వయసు 65 నుంచి 57 ఏళ్లకు కుదించడంతో ప్రతి మండలంలో 2 నుంచి 3 వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇలా మండలాలు, పురపాలికలు కలిపి లక్షకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని ఆయా జిల్లాల అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. దీనికి తోడు భర్త మరణిస్తే.. భార్యకు బదిలీ అవ్వాల్సిన పెన్షన్లు సైతం పెండింగ్‌లో ఉన్నాయి.

ప్రతినెల రూ.84.33 కోట్ల పంపిణీ..

నగర శివారు మేడ్చల్ –మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలో 3,51,611 మంది లబ్ధిదారులు ఉండగా.. వీరికి ప్రతినెలా రూ.84.33 కోట్లు పంపిణీ చేస్తున్నారు. మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లాలో 1,49,482 మంది లబ్ధిదారులు ఉన్నారు. వృద్ధులు 61,742, వితంతువులు 58,915 మంది, దివ్యాంగులు 22,037 మంది, ఒంటరి మహిళలు 5,876, చేనేత కార్మికులు 138 , కల్లుగీత 435, బీడీ కార్మికులు 169, బోదకాల బాధితుల పెన్షన్లు 170 మంది ఉన్నారు. దివ్యాంగులకు రూ.4,016, మిగతా వారందరికీ రూ.2,016 చొప్పున ప్రతినెలా రూ.34.73 కోట్లు పంపిణీ చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం.. పెన్షన్ రూ.4 వేలకు పెంచితే వృద్ధులు, వితంతువులు ఇతర పెన్షన్‌దారులకు ప్రయోజనం చేకూరనుంది. ఈ మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

పెన్షన్ లేక అవస్థలు పడుతున్నాం

నా భార్య అనారోగ్యంతో మంచం పట్టింది. నేను ఆమెను చూసుకోవాల్సి వస్తోంది. నాకు 63 ఏళ్లు వచ్చాయి. ఇప్పటి వరకు పెన్షన్ రాలేదు. అనేకసార్లు దరఖాస్తు చేసుకున్నాను. పెన్షన్ రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మా లాంటి వారికి ప్రభుత్వం పెన్షన్ అందించి ఆదుకోవాలి.
– సలీమ్‌పాషా, నేరేడ్‌మెట్, మల్కాజిగిరి